## క్లుప్తంగా

### మిగిలిన సీట్లకు అడ్మిషన్లు

**మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్యూలా**



**బంట్వారం:** తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు బంట్వారం ప్రిన్సిపాల్ బ్యూలా తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 6 నుంచి తొమ్మిదోతరగతి, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### మండల నూతన ఏపీఎంగా శోభ



బాధ్యతలు స్వీకరించిన శోభ

**దోమ:** మండల నూతన ఏపీఎంగా శోభ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీఎం సురేశ్ తాండూర్ పట్టణానికి బదిలీ అయ్యారు. కుల్కచర్ల మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న శోభ దోమకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తూ మహిళలను అభివృద్ధి పరిచే దిశగా కృషి చేస్తానన్నారు. ప్రతి గ్రామంలో నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

### మహా ధర్నాకు తరలిరావాలి

**బీజేపీ ఓబీసీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్**

**బంట్వారం:** గౌడ కులస్తుల హక్కుల సాధన కోసం ఇందిరా పార్క్ వద్ద శనివారం నిర్వహించనున్న మహా ధర్నాకు రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలి రావాలని బీజేపీ ఓబీసీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేషం గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు మహాధర్నా ఉంటుందని పేర్కొన్నారు. గౌడ హక్కుల సాధన కోసం అందరం కలిసి కట్టుగా నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు గానూ గౌడ కులస్తులందరూ అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

### శ్రీమహాదేవుని ఆలయంలో పూజలు



శివపురాణం పారాయణం చేస్తున్న అక్కమహాదేవి మహిళా సమాజం సభ్యులు

**కొడంగల్ రూరల్:** పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో శ్రావణ మాసం పురస్కరించుకొని అక్క మహాదేవి మహిళా సమాజం సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం శివలింగానికి, శ్రీపార్వతీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పార్వతీమాత ఆలయ ఆవరణలో గణపతి స్తోత్రం, సామూహిక శివ పురాణ పారాయణం, లింగాష్టకం, అన్నపూర్ణాష్టకం, శివాష్టోత్తర శతనామావళి, భ్రమరాంబికాష్టకం పారాయణం చేశారు. అనంతరం అమ్మవారికి దూప దీప నైవేద్యాలను సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు.

### చిన్నారులకు ఫిజియోథెరపీ అవసరం

**ఫిజియో డాక్టర్ శ్రీకాంత్**



ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్, పక్కనే ఎంఈఓ నర్సింగ్‌రావు

**తాండూరు రూరల్:** మానసిక, శారీరక అంగ వైకల్యం, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపీ అవసరమని తల్లిదండ్రులకు ఫిజియో డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్దేముల్ మండల కేంద్రంలో మంగళ, శుక్రవారం ఫిజియోథెరపీ నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఎంఈఓ నర్సింగ్‌రావు మాట్లాడుతూ..దివ్యాంగుల్లోనూ ప్రతిభను వెలికితీసి వారిలో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ శ్రీనివాస్‌గౌడ్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరా బంద్

- మూడు రోజులుగా నిలిచిన సేవలు
- ఆలేడ్‌లో లోపించిన పారిశుద్ధ్యం
- వేతనాల్లో కోత విధించడంతో మనస్తాపంతో విధులకు దూరం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ట్యాంకు నిండి వృథాగా పోతున్న నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

**దుద్యాల్:** మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో పారిశుద్ధ్యం లోపిస్తోంది. పంచాయతీ కార్మికుల వేతనాల్లో పంచాయతీ కార్యదర్శి కోత విధించాడనే కారణంతో మనస్థాపానికి గురైన కార్మికులు రాములు, పక్కీరప్పలు విధులకు దూరంగా ఉంటున్నారు. దీంతో గ్రామంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకపోతోంది. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అంతేకాకుండా తాగు నీటి సరఫరా మూడు రోజులుగా బంద్ చేశారు. నీటిని వదిలే వారు లేరని స్థానికులు చెబుతున్నారు. దీంతో అక్కడ నీటిని విడుదల చేయకపోవడంతో ట్యాంక్ నిండి వృథాగా పోతున్న నీటిని గ్రామస్తులు పట్టుకుంటున్నారు. గ్రామంలో రోజు రోజుకు సమస్యలు పెరుగుతున్నాయని వాటిని పట్టించుకునే నాదుడే కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్మికులకు దాదాపు ఏడు నెలల వేతనాలు రావల్సి ఉండగా ఇటీవలే మూడు నెలల వేతనాలు పంపిణీ చేశారు. అందించిన వేతనాల్లో ఒక్కో నెల రూ. 5వేల చొప్పున కోత విధించారు. మిగత నాలుగు నెలల వేతనాలు కూడా గ్రామ పంచాయతీ ఖాతాలో జమైనప్పటికీ వాటిని పంపిణీ చేయలేదు. పని చేసిన వాటికి వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదని మనస్థాపానికి గురై కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే తాము విధులకు రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి వివరణ కోరగా కార్మికులు సక్రమంగా పని చేయకపోవడంతో వేతనాల్లో కోత విధించానని వివరణ ఇచ్చారు. మిగిలిన నాలుగు నెలల వేతనాలు కావాలంటే విధుల్లో చేరాలని, లేదంటే నాలుగు నెలల వేతనాలు కూడా ఇవ్వబోమని హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయాన్ని మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా కార్మికులతో మాట్లాడుతున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి ఆలేడ్ గ్రామంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అవగాహనతోనే టీబీ నిర్మూలన

**అంగడిరాయిచూర్ ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ బుస్రా**



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**కొడంగల్ రూరల్:** అవగాహనతోనే టీబీ నిర్మూలించొచ్చని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు డాక్టర్ బుస్రా పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 103మందికి పరీక్షలు చేసినట్లు, 38మందికి కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. టీబీ పేషంట్ల కుటుంబ సభ్యులు, డయాలసిస్, పొగాకు వాడేవారికి, ఆల్కహాలు తీసుకునేవారికి, బీపీ, షుగర్, హెచ్‌ఐవీ, 60ఏళ్లు దాటిన వృద్ధులతోపాటు వివిధ రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఎవరైనా వ్యాధి నిర్ధారణకు గురైతే 6నెలలపాటు ఉచితంగా మందులు అందించనున్నట్లు, పౌష్టికాహారం కోసం నెలకు రూ. 1,000 ప్రభుత్వం ఆర్థిక సాయం చేయనుంది. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు అశ్విని, లక్ష్మి, నిర్మల, టీబీ సూపర్‌వైజర్ రాహత్‌అలీ, సూపర్‌వైజర్ సుశీలమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ విద్యార్థులకు దుస్తుల పంపిణీ



చిన్నారులకు యూనిఫాం అందిస్తున్న ఎంపీఓ సత్యనారాయణ

**దుద్యాల్:** మండల పరిధిలోని ఆలేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏకరూప దుస్తువులను ఎంపీఓ సత్యనారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించిన మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రంలో అందజేశామన్నారు. పూర్వ ప్రాథమిక దశలో చిన్నారులు చదువుపై ఆసక్తిపెంచుకుంటే ప్రాథమిక దశలో బాగా నేర్చుకుంటారని, అందుకు గాను టీచర్ పూర్తి స్థాయిలో చిన్నారులకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భారతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఆయా వెంకటమ్మ, కొడంగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు శ్రీధర్ గౌడ్, నర్సిములు గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కుల్కచర్ల పంచాయతీలో పాము కలకలం

- భయాందోళన చెందిన సిబ్బంది
- స్నేక్ క్యాచర్‌తో పట్టివేత



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్

**కుల్కచర్ల:** కుల్కచర్ల గ్రామ పంచాయతీలో పాము కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పంచాయతీ సిబ్బంది పంచాయతీ కార్యాలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లారు. అందులో ఓ పాము కనిపించింది. దీంతో భయాందోళనకు గురైన సిబ్బంది స్నేక్ క్యాచర్‌కు సమాచారం చేరవేశారు. అక్కడి చేరుకున్న స్నేక్ క్యాచర్ పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలాడు. పాముల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని స్నేక్ క్యాచర్ సూచించారు.

# అధిక ధరలకు యూరియా విక్రయం



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

- చోద్యం చూస్తున్న వ్యవసాయాధికారులు
- ఫర్టిలైజర్ దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలి
- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్ డిమాండ్

**తాండూరు టౌన్:** తాండూరు నియోజకవర్గ పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు రైతు సంఘం సభ్యులు పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు, రైతు ఆగ్రోస్ దుకాణాల్లో సైతం యూరియా, డీఏపీలపై ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే రూ. 200లు అదనంగా పెంచి విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంలో వ్యవసాయాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, మల్కయ్య, కిషన్ నాయక్, రుస్తుం, రాంచందర్, మహమూద్, సతీష్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు
- ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ వెంకట్



దిర్సంపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ వెంకట్

**దోమ:** మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వండిపెట్టాలని నిర్వాహకులకు ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి పాఠశాలలో మధ్యాహ్న బోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం పాఠశాలల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఎవరైనా విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు ప్రతీరోజు మెరుగైన విద్యా బోధన చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీవిద్య, ఉపాధ్యాయులు స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

### నేడు స్పీకర్ రాక

**మర్పల్లి:** మండల కేంద్రంలో శనివారం మార్కెట్ యార్డు ఆవరణలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ విచ్చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు సురేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

**తాండూరు రూరల్:** ప్రతీ రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని పెద్దేముల్ మండల వ్యవసాయశాఖ అధికారి(ఏవో) పవన్ ప్రీతం పేర్కొన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతీ రైతుకు ఆధార్ తరహాలో ఫార్మర్ గుర్తింపు నంబర్ ఇస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈ కార్డు తప్పనిసరన్నారు. పెద్దేముల్‌లో 15,104 మంది ఉన్నారని, ఇందులో 6,500 మంది ఇప్పటివరకు రిజిస్ట్రీ చేయించుకున్నారని తెలిపారు. చేసుకోని వారు రైతు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్ లింకుఉన్న ఫోన్ నంబర్ తీసుకొని సంబంధిత ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు.

### పేదల సంక్షేమమే ధ్యేయం

**హస్నాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీములు**



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందిస్తున్న నాయకులు

**దుద్యాల్:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని హస్నాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూర్పు భీములు పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు మంజూరు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ అందజేసి ఇళ్ల నిర్మాణ పనులకు ముగ్గుపోశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, నాయకులు గోపాల్, నరేశ్, నర్సిములు, రాజు, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

**తాండూరు రూరల్:** ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జినుగుర్తి పీహెచ్‌సీ వైద్యులు రషీద్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 రోజులకు పైబడి దగ్గు, ఆయాసం, ఛాతి నొప్పి, జ్వరం, బరువు తగ్గుట వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఎన్‌ఎం రాధా, ఆశ వర్కర్లు విమలమ్మ, అంజమ్మ, అరుణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

**కొందుర్గు:** పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ అన్నారు. శుక్రవారం చౌదరిగూడ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, యూనియన్ నాయకులు శివ, జాకీర్, అల్తాఫ్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- 5న నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలి
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ డిమాండ్

**కొడంగల్ రూరల్:** రాష్ట్రంలో విద్యారంగా, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.శ్రీశైలం, సంఘం జిల్లా కన్వీనర్ బసప్ప, రంగారెడ్డి అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూటీఎఫ్ నాయకులు నర్సిములు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న నిర్వహించనున్న జిల్లా స్థాయి మహాధర్నాను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ రకాల పెండింగ్ బిల్లులను, జీపీఎఫ్, ఏరియర్స్‌లను వెంటనే విడుదల చేయాలని, అన్ని క్యాడర్లలో బదిలీలు, పదోన్నతులు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని, జీవో నంబర్ 25ను సవరించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేస్తూ పాత పెన్షన్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని, జీవో 317కారణంగా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు వచ్చేవిధంగా అవకాశం కల్పించాలని తదితర అనేక డిమాండ్ల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ యూఎస్‌పీసీ ఉపాధ్యాయ నాయకులతో చర్చలు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆగస్టు 31న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.



ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు

# నాలుగు గదులకు ప్రణాళిక సిద్ధం

- పంచాయతీ రాజ్ ఏఈ నాగేందర్ వెల్లడి
- కుదురుమల్ల పాఠశాల భవనం పరిశీలన





పెచ్చులూడిన గదిని పరిశీలిస్తున్న అధికారులు

**దుద్యాల్:** మండల పరిధిలోని కుదురుమల్ల పాఠశాల శిథిలావస్థకు చేరడంతో భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. సాక్షిలో పెచ్చులూడిన పాఠశాల పైకప్పు అనే శీర్షికతో శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి పాఠశాల భవనాన్ని పరిశీలించాలని పంచాయత్‌రాజ్ ఏఈ నాగేందర్‌కు, మండల విద్యాధికారి విజయరామారావు, ఎంపీడీవో మహేశ్ కుమార్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులందరు పాఠశాలకు వెళ్లి భవనాన్ని పరిశీలించారు. అనంతరం కడా అధికారితో ఏఈ నాగేందర్ ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలకు నాలుగు కొత్త గదుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయమని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘుపతి, గ్రామస్తులు సూర్యప్రకాశ్ రెడ్డి, యాదవ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

**బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్**



మాట్లాడుతున్న అనిల్

**బంట్వారం:** స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ పేర్కొన్నారు. శుక్రవారం ఎన్కెపల్లి, జిన్నారం గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సత్తాచాటాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం ఎన్కెపల్లి, జిన్నారం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రవి, ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ మహేందర్, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఆర్టీయూతోనే పీఆర్సీ సాధ్యం

**జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రామ్‌రెడ్డి**

**బషీరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వంచే పీఆర్సీని అమలు చేయించగల సత్తా పీఆర్టీయూకే ఉందని జిల్లా గౌరవ అధ్యక్షుడు దర్మీది వెంకట్‌రామ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహారెడ్డి, రవీందర్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు ఒక్క పీఆర్టీయూతోనే పరిష్కారం అవుతాయన్నారు. ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవికాంత్, ఈశ్వర్ గౌడ్, నాగరాజు, విజయ్ కుమార్ జోషి, ఆయుబ్‌పాషా, శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు రవికుమార్, అల్లావుద్దీన్, సులేమాన్, ముస్తఫా, నాగరాజు, రామ్ చందర్, నర్సింలు, మండల నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మౌలాన తదితరులు పాల్గొన్నారు.

**మున్నూరుసోమారంలో..**

**ధారూరు:** మున్నూరుసోమారం ప్రాథమిక పాఠశాలలో పీఆర్టీయూ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం కె. చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం కుక్కింద పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం బాధ్యులు మాణిక్యం, రవీందర్ రెడ్డి, గుణవంత్‌రెడ్డి, సత్యం, నిజామొద్దీన్, బుచ్చయ్య, సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





బషీరాబాద్: ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

### సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

**వైద్యాధికారి కిరణ్‌గౌడ్**



జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**కుల్కచర్ల:** సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని వైద్యాధికారి కిరణ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లతో ఇంటింటికి తిరిగి జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలంతా సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.